





# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :243 28 మంగళవారం, జులై 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari




## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ,జులై 27( ప్రజా వీక్షణం ):**

దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు.

...మిగతా 2 లో...



## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం

### అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

**ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం**

**ఖమ్మం,జూలై27( ప్రజా వీక్షణం ):**

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

...మిగతా 2 లో...




## కేంద్రం హామీలు బుట్టదాఖలు

- కేసుల ఎత్తివేతపై కదలిక లేని ఉత్తర్వులు
- ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ ఆందోళనలు
- న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- కాక్రోచ్ జనతాపార్టీ నేతల వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై27( ప్రజా వీక్షణం ):**

నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహరణనపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశవ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని మరియు వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోదని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు.

...మిగతా 2 లో...



## ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

- విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం
- యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్

...మిగతా 2 లో...

## బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

### తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్,జూలై27( ప్రజా వీక్షణం ):**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ...మిగతా 2 లో...

## పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

- మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు
- గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా



**న్యూఢిల్లీ,జూలై27( ప్రజా వీక్షణం ):**

పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి.

...మిగతా 2 లో...



## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

**న్యూఢిల్లీ,జూలై27( ప్రజా వీక్షణం ):**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

...మిగతా 2 లో...



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

### ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

**హైదరాబాద్,జూలై27( ప్రజా వీక్షణం ):**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.



## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది..!

- ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా
- చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం

**న్యూఢిల్లీ,జులై 27( ప్రజా వీక్షణం ):**

నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

...మిగతా 2 లో...

# సంపాదకీయం

## జవాబుదారీతనం కోల్పోవడంతోనే ... ప్రజా ఉద్యమాలు !

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జిఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జిఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వండ లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్దతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకలు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్ముకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉదీథంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

మొదటిపేజీ తరువాయి

2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## కేంద్రం హామీలు బుట్టదాఖలు

మొదటిపేజీ తరువాయి

బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయసహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించు కుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళన కారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించు కోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్‌ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం ఎ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.

## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

మొదటిపేజీ తరువాయి

విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణెళి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

హైదరాబాద్,జులై 27( ప్రజా వీక్షణం ): మొదటిపేజీ తరువాయి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా..? అని ప్రశ్నించారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడు తున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

## పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

మొదటిపేజీ తరువాయి

గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి.

## బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

మొదటిపేజీ తరువాయి

మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

# రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి






బాపట్ల : జూలై 27 ( ప్రజా వీక్షణం )

రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల ఆధ్వర్యంలో సోమవారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా బాపట్ల మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.....అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా,క్షిపణి శాస్త్రవేత్తగా ,భారత దేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న అవార్డు గ్రహితగా. మిస్సైల్ మెన్ గా పేరుగాంచారని తెలిపారు. నేటి యువతకు ఆయన ఆదర్శప్రాయుడని,కలలు కనండి ఆ కలలను నెరవేర్చుకోవడానికి నిరంతరం శ్రమించండి,గెలుపు పొందినప్పుడు పొంగి పోకూడదు,ఓటమి ఎదురైనప్పుడు కృంగిపోకూడదు వైఫల్యం అనేది విజయానికి మొదటి మెట్టు అని ఆయన వ్యాఖ్యలు గుర్తు చేసుకుంటూ.....ఆయన చివరి క్షణం వరకు చదువు సమాజ శ్రేయస్సు కోసమే జీవించిన మహనీయుడు అబ్దుల్ కలాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి,కోశాధికారి కోళ్ళపూడి బాలాజీ,సీనియర్ రోటరీ సభ్యులు ఇ.హరిబాబు, జిట్టా శ్రీనివాసరావు, కోళ్ళపూడి ఉపేంద్ర గుప్త,ఎస్. రమేష్ బాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల పట్టణం 33వ వార్డులో " రెండు ఏళ్ల నమ్మకం - అభివృద్ధి,సంక్షేమం" ఇంటింటి ప్రచారం

### ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించిన టీడీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి ఆంద్రేయ్య

బాపట్ల:జూలై 27 ( ప్రజా వీక్షణం )

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న " రెండు ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం " కార్యక్రమంలో భాగంగా బాపట్ల పట్టణం 33వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పట్టణ అధ్యక్షులు మందపాటి ఆంద్రేయ,క్లస్టర్ ఇంచార్జి కూచిపూడి శ్యాంసుందర్,టీడీపీ బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి కూచిపూడి ఝాన్సీ రాణి ప్రచారంలో భాగంగా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి,గత 2 సంవత్సరాల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం,ఉచిత పథకాలు,మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి,వాటి సద్వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కూచిపూడి శ్యాంసుందర్,టీడీపీ బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి కూచిపూడి ఝాన్సీ రాణి,33వ వార్డు ప్రెసిడెంట్ ఐనంపూడి షాలేం రాజు,73వ బూ త్ ఇన్చార్జి ఐనంపూడి వంశీ,43వ బూత్ ఇంచార్జ్ సంగీతం ప్రసాద్,టీడీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యుత్ వైర్లు బలిగొన్న నిండు ప్రాణం.. ఆ కుటుంబానికి తక్షణమే ఎక్స్-గ్రేషియా చెల్లించాలి!

### మృతుడు చావల అప్పారావు (43) కుటుంబానికి ప్రభుత్వ ఆసరా కావాలని సామాజిక కార్యకర్తల డిమాండ్

### పీజీఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

### మండలంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లు, గుంతలపై తీవ్ర ఆందోళన

టి.నర్సాపురం, జూలై 27:(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం తెడ్లం గ్రామంలో జరిగిన ఘోర ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పొలంలో విద్యుత్ ఘాతానికి గురై రైతు చావల అప్పారావు (43) మృతి చెందడం పట్ల సామాజిక కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, అప్పారావు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, నిబంధనల ప్రకారం భారీ ఎక్స్-గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం టి.నర్సాపురం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు జిల్లా కలెక్టర్ తరపున ఎంపీడీవో వై.వి.ఆర్.వి ప్రసాద్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్తలు యస్.డి. నాసర్ పాషా, తాడిగడప జయరాజు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ శాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు అత్యంత ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయని, చెట్ల కొమ్మలతో పెనవేసుకుని ఉన్నాయని తెలిపారు. బంధం-చర్ల రోడ్డులో కరెంటు స్తంభాల కోసం తవ్వి వదిలేసిన ప్రమాదకర గుంతల కారణంగా ఇప్పటికే ఒక లేగదూడ అందులో పడి కాలు విరిగిందని, ఇది అధికారుల నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. అలాగే సామాజిక కార్యకర్తల ప్రధాన డిమాండ్ల ప్రకారం విద్యుత్ ఘాతంతో మృతి చెందిన రైతు చావల అప్పారావు కుటుంబాన్ని ఆదుకుని, తక్షణమే ఎక్స్-గ్రేషియా చెల్లించాలి. మండలంలోని అన్ని ప్రాంతాలలో క్రిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి, అవసరమైన చోట కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే నరికించాలి. ప్రతి సబ్ స్టేషన్ వద్ద ప్రజల సమస్యల నమోదు కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి. బంధం-చర్ల రోడ్డులో ప్రమాదాలకు నిలయంగా మారిన కరెంటు స్తంభాల గుంతలను వెంటనే పూడ్చివేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు తాడిగడప జయరాజు, పింగుల మధు, బంటు సరవయ్య, పులగిరి వెంకట్, మేడంకి శేఖర్, రాచప్రోలు నాగేశ్వరరావు, గొద్దికోళ్ల సురేష్, బొక్క కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



# కుంగ్ ఫు రాష్ట్రస్థాయి టోర్నమెంట్ లో బంగారుపతకం సాధించిన డౌన్ సిండ్రోమ్ బాయ్ రావు శ్రీకృష్ణదేవరాయలు

చిలకలూరిపేట : జూలై 27 ( ప్రజా వీక్షణం )

తూర్పు గోదావరి జిల్లా మండపేట పట్టణంలో రాష్ట్రస్థాయిలో జరిగిన కుంగ్ ఫు పోటీల్లో చిలకలూరిపేట నుండి గ్రాండ్ మాస్టర్ కమాల్ భాషా ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు .డౌన్ సింద్రోమ్ బాయ్ రావు శ్రీకృష్ణదేవరాయులు(బ్లాక్ బెల్ట్) ప్రత్యేక ప్రదర్శన ఇచ్చిన సందర్భం గా గోల్డ్ మెడల్ సాధించా డు.మం డపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరా వు,ఏపీఐడీసీ ఛైర్మన్ వేగుళ్ళ లీలా కృష్ణ పాల్గొని రావు శ్రీకృష్ణదేవ రాయలుకు బంగారు పతకాన్ని ప్రధానం చేశారు. తూర్పు గోదావరి జిల్లా మండపేట పట్టణంలో మదర్ థెరిసా సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు మరియు వైవీఎన్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీవత్స కన్వెన్షన్ హాల్ లో రాష్ట్ర స్థాయిలో కుంగ్ ఫు,కరాటే,తైక్వాండో పోటీలు నిర్వహించారు.




# వెదుళ్లపల్లిలో గంజాయి విక్రయాలు.. వినియోగంపై పోలీసుల దాడి

### నలుగురు అరెస్టు..

### 190 గ్రాముల గంజాయి,నాలుగు సెల్‌ఫోన్లు,స్కూటర్ స్వాధీనం

బాపట్ల ( వెదుళ్లపల్లి ) :జూలై 27

( ప్రజా వీక్షణం )

గంజాయి విక్రయాలు, వినియోగంపై బాపట్ల మండలం వెదుళ్లపల్లి పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. విక్రయదారుడి ఆచూకీ లభించింది. దీంతో మొత్తం నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి సుమారు 190 గ్రాముల గంజాయి,నాలుగు మొబైల్‌ఫోన్లు, రూ. 600 నగదు, టీవీఎస్ జూపిటర్ స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు .పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 26న మధ్యాహ్నం వెదుళ్లపల్లి గ్రామంలోని వడ్డెరపాలెం ఎదురుగా ఉన్న హిందూ శ్మశానవాటిక వద్ద కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు, క్లూస్ టీం, మధ్యవర్తులతో కలిసి అక్కడ దాడి చేశారు. ఈ సందర్భంగా పేరం సాయిచంద్, దేవరకొండ హేమంత్ కుమార్, రావినూతల అచ్చుత్ సాయికుమార్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద మూడు గంజాయి ప్యాకెట్లు లభించాయి. విచారణలో కుప్పలమెట్ట, వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన దేవి ఏడుకొండలు రెడ్డి వద్ద రూ. 600కు గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు .దీంతో దేవి ఏడుకొండలు రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించ గా.. అతని వద్ద 15 గంజాయి ప్యాకెట్లు, రూ. 600 నగదు, టీవీఎస్ జూపిటర్ స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు .మొత్తం నలుగురి నుంచి సుమారు 190 గ్రాముల గంజాయి, నాలుగు మొబైల్‌ఫోన్లు, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 27(బి), 20(బి)(అఅ)(ఎ) ఆర్/డబ్ల్యూ 8(సి) కింద కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు .గంజాయి విక్రయాలు, సరఫరాతో సంబంధం ఉన్న మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామ హేశ్వర్ ,ఆదేశాల మేరకు.. బాపట్ల సబ్‌డివిజన్ డీఎస్పీ చి. చంద్రమౌళి సూచనలతో.. బాపట్ల రూరల్ సీఐ బి. హరికృష్ణ పర్యవేక్షణలో ఈ దాడి జరిగింది .కేసును సమర్ధవంతంగా ఛేదించిన ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు, హెచ్‌సీలు తిరుపతిరాజు, అంకయ్య,పీసీలు రమేష్, రాజేష్‌లను ఎస్పీ అభినందించారు. నిందితులపై నమోదైన కేసులు- దేవి ఏడుకొండలు రెడ్డి: గంజాయి విక్రయ ఆరోపణలపై అరెస్టు- పేరం సాయిచంద్: 4 కేసుల్లో నిందితుడు- దేవరకొండ హేమంత్ కుమార్: 11 కేసుల్లో నిందితుడు- రావినూతల అచ్చుత్ సాయికుమార్: 2 కేసుల్లో నిందితుడు



# వర్షం పడితే చాలు.. జలమయమవుతున్న కీసర-గండేపల్లి రోడ్డు... డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్థుల ఆందోళన!

ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలం:జులై 27(ప్రజా వీక్షణం)

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర గ్రామం నుండి గండేపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై కొద్దిపాటి వర్షానికే భారీగా నీరు చేరుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు వెంబడి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచిపోయి, రోడ్డు పూర్తిగా దెబ్బతింటోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజలు ఈ బురద నీటిలోనే ప్రయాణించాల్సి వస్తోందని, దీంతో పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే ఇలాంటి దుస్థితి తలెత్తుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రోడ్డుకు ఇరువైపులా శాశ్వత ప్రాతిపదికన పక్కా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని గ్రామ ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# అనుమతులు లేని అతిథి నివాసంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు

## జై భీమ్ రావ్ భారత పార్టీ వినతి

బాపట్ల :జూలై 27 ( ప్రజా వీక్షణం )

బాపట్ల జిల్లా బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని శిఖరం వారి వీధిలో ఉన్న "అతిథి నివాసం" భవనానికి ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ,ఆ భవనంపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని జై భీమ్ రావ్ భారత పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు డాక్టర్ పఠ్రె కోటయ్య సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్.వి.వినోద్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....గతంలో పలుమార్లు బాపట్ల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని తెలిపారు.ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని పేర్కొంటూ బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపించారు.అలాగే,సమాచార హక్కు చట్టం (ఆర్ టీ ఐ ) ద్వారా రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ, ఆంధ్రప్రదేశ్, విజయవాడ కార్యాలయం 2026 జూలై 17న ఇచ్చిన సమాధానంలో, ఆ భవనానికి తమ శాఖ నుంచి ఎటువంటి ఫైర్ సేఫ్టీ అనుమతులు మంజూరు చేయలేదని స్పష్టం చేసినట్లు తెలిపారు.రెసిడెన్షియల్ భవనంగా ఉండాల్సిన ప్రదేశంలో కమర్షియల్ లాడ్జిగా నిర్వహిస్తున్నందున ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.అగ్నిప్రమాదం వంటి అనుకోని సంఘటనలు జరిగితే భారీ ప్రాణ,ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.అందువల్ల సంబంధిత భవనానికి అన్ని చట్టబద్ధమైన అనుమతులు పొందే వరకు కార్యకలాపాలను నిలిపివేయాలని,భవనంపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ ఫిర్యాదుకు సంబంధించిన బాపట్ల మున్సిపాలిటీ అధికారులు అందించిన పత్రాలు,అలాగే రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆర్ టీ ఐ సమాధానం ప్రతులను జిల్లా కలెక్టర్‌కు జతచేసినట్లు డాక్టర్. పఠ్రె కోటయ్య తెలిపారు.



# ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సమరానికి వేళాయెను!

## మున్సిపల్, పరిషత్, పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్

అమరావతి జులై 27:(ప్రజా వీక్షణం)

రాష్ట్రంలో ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ప్రభుత్వం ముమ్మర కసరత్తు ప్రారంభించగా, ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి కీలక ప్రణాళిక వెలువడింది. కేవలం 40 రోజుల్లోనే విడతలవారీగా ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.సెప్టెంబర్ రెండో వారం తొలుత మున్సిపల్ ఎన్నికల నిర్వహణతో సమరానికి తెరలేవనుంది. అలాగే అనంతరం మున్సిపల్ ఎన్నికల జోరు ముగిసిన వెంటనే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ రెండో వారం గ్రామాల్లో రాజకీయాన్ని వేడెక్కించే పంచాయతీ ఎన్నికలను చివరి విడతలో నిర్వహించేందుకు పకడ్బందీ సన్నాహాలు చేస్తున్నారు. తొలి విడతలో పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ సమరం ప్రారంభమై, మధ్యలో పరిషత్ పోరు ముగిసి, చివరికి అక్టోబర్ నాటికి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలతో ఏపీలో స్థానిక ఎన్నికల పర్వం పరిపూర్ణం కానుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది.



# ఎమ్మెల్యే గారు ఇవేమీ కరెంటు కోతలు..

## స్పందించని అధికారులు..

దేవరకద్ర జూలై 27 ప్రజా విక్షణం

దేవరకద్ర మండల కేంద్రంలో ఎమ్మెల్యే గారు ఏవే మి కరెంటు కోతలని ప్రజలు అంటున్నారు. నియోజకవర్గం కేంద్రమైన కూడా కరెంట్ మాత్రం 24 గంటలు ఉన్న పాపన పోలేదు. ఎప్పుడు చూసినా కోతలే తప్ప కరెంటు మాత్రం సక్రమంగా ఉండడం లేదని ప్రజలు అంటున్నారు. గత ప్రభుత్వంలో కరెంటు పోయేది కాదని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ఇష్టం వచ్చినట్లు కరెంటు పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక ఎమ్మెల్యే నియోజకవర్గంలో కరెంటు కోతలు ఈ విధంగా ఉంటే వేరే గ్రామంలో ఏ విధంగా ఉంటుందని అంటున్నారు. ఫోన్ చేసినా కూడా విద్యుత్ అధికారులు స్పందించడం లేదు. అందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకొని దేవర మండల కేంద్రంలో కరెంటు పోకుండా ఉండేందుకు ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.





**సరాసరి ధర రూ.310 అమలు జరిగేలా చర్యలు చేపట్టాలి.**

**పొగాకు రైతులకు ధరల స్థిరీకరణ పథకం వర్తింప చేయాలి.**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్..**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం - పొగాకు రైతు సంఘాల ఆధ్వర్యంలో కొనుగోళ్లు పరిశీలన...**

**పొగాకు రైతులు ఆందోళన**

జంగారెడ్డిగూడెం జూలై 27:(ప్రజా వీక్షణం)

వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సరాసరి ధర రూ.310 అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని, పొగాకు రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింప చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెంలోని 18,32 పొగాకు బోర్డు వేలం కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వేలం కేంద్రాల పరిది లోని పొగాకు రైతు సంఘాల ఆధ్వర్యంలో పొగాకు కొనుగోళ్లు పరిశీలించారు. ప్రస్తుతం పొగాకు ధరలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొగాకు రైతు సంఘాలతో సంయుక్త సమావేశం నిర్వహించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తూ వేలం కేంద్రాల ముందు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కిలో వర్జీనియా పొగాకు అత్యధిక ధర రూ. 275 గాను,అత్యల్ప ధర రూ. 170 గా ఉందని చెప్పారు. ఎన్.ఎల్.ఎస్ ఏరియాలో 80 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి కాగా ఇప్పటివరకు 30 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు జరగాల్సి ఉండగా కేవలం 10 మిలియన్ల కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు జరిగిందన్నారు. పొగాకు కొనుగోళ్లు చాలా ఆలస్యంగా నత్తనడకన సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు ఉత్పత్తి ఖర్చు కౌలుతో కలుపుకుని 3లక్షల 50 వేల రూపాయలకు పైగా ఉందని, రైతు ఉత్పత్తి ఖర్చు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని దీనితో పొగాకు రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలు ఇందుకు కారణంగా చెబుతున్నా రైతును ఆదుకునే చర్యలు ప్రభుత్వాలు చేపట్టకపోవడమే ఇందుకు కారణమని విమర్శించారు. పొగాకు కొనుగోలు కంపెనీలు సిండికేట్ గా మారి రైతులకు నష్టం కలిగిస్తున్నాయని, రైతును నిలువునా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్న ఇంతవరకు సమస్యకు పరిష్కారాన్ని చూపలేదన్నారు. వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సరాసరి ధర కిలోకు రూ.310 అమలు చేయాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధి పథకం పొగాకు రైతులకు వర్తింపచేయాలన్నారు. పొగాకు బోర్డు నుండి పొగాకు కొనుగోలుకు రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. పొగాకు రైతులందరూ ఐక్యంగా గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 18,32 వేలం కేంద్రాల అధ్యక్షులు సత్రం వెంకట్రావు, పరిమి రాంబాబు, పొగాకు రైతు సంఘం నాయకులు ఎల్. సత్యనారాయణ, వామిశెట్టి హరి బాబు,బిక్కన వెంకటేశ్వరరావు, బిక్కిన వీరసత్యం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, నాయకులు బోడిక రామచంద్రరావు ,మాండ్రు సూర్య చంద్రం, కూచిపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పరివర్తన్ పాఠశాలలో వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు 'గ్రూప్ హియరింగ్ సిస్టమ్' ప్రారంభం





**దివ్యాంగులకు తగిన అవకాశాలిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారు: ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీ ఎస్**

ఏలూరు (దొండపాడు):జులై 27(ప్రజా వీక్షణం)

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఆధునిక సాంకేతిక పరికరాలు, నాణ్యమైన విద్య, సరైన ప్రోత్సాహం అందిస్తే వారు సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీ ఎస్ స్పష్టం చేశారు .ఏలూరు జిల్లా దొండపాడులోని 'పరివర్తన్ ప్రత్యేక పాఠశాల'లో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల బోధన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక 'గ్రూప్ హియరింగ్ సిస్టమ్'లిను ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా హియరింగ్ ఎయిడ్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ "ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఎవరికీ తీసిపోరు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలి. వీరిని ప్రేమతో, గౌరవంతో ఆదరించినప్పుడే సమాజం లో నిజమైన మార్పు వస్తుంది." అని పిలుపునిచ్చారు .పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంకేతిక పరికరాలు దివ్యాంగ



విద్యార్థుల చదువుకు, వారి మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని ఆయన కొనియాడారు.ఈ సత్కార్యానికి కొండంత అండగా నిలిచి గ్రూప్ హియరింగ్ సిస్టమ్ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించిన దాతలు రావెళ్ల కిషోర్ ప్రసాద్,స్వర్ణ కి పాఠశాల యాజమాన్యం, పోలీసులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, పాఠశాల నిర్వహకులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ముఖాల్లోని చిరునవ్వే ఈ కార్యక్రమానికి నిజమైన విజయమని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

# జంగారెడ్డిగూడెంలో ఘనంగా 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం!

### మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 5 కోట్లు విడుదల... ప్రతీ వార్డుకు రూ. 15 లక్షలు కేటాయింపు

### రూ. 101 కోట్లతో మంచినీటి వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన

### ఉప్పలమెట్టలో ఉత్సాహంగా సాగిన డోర్ టు డోర్ క్యాంపెయిన్

**జంగారెడ్డిగూడెం జులై 27(ప్రజా వీక్షణం):**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు గత రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం జంగారెడ్డిగూడెంలో సోమవారం ఉదయం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఉదయం 8:30 గంటలకు ఉప్పలమెట్ట వినాయకుడి గుడి వద్ద నుంచి ఈ డోర్-టు-డోర్ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైంది. ఉప్పలమెట్టలోని ప్రతీ వీధిని నాయకులు తిరిగి, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు, వార్డు సభ్యులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, కరెంట్ మరియు తాగునీటి సమస్యలపై ఇబ్బందులు ఉన్నట్లు నాయకులకు విన్నవించారు. ప్రజల సమస్యలపై స్పందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు వారికి భరోసా కల్పించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 5 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఆ నిధుల నుంచి ప్రతీ



వార్డుకు రూ. 15 లక్షలు కేటాయించి, తద్వారా రోడ్లు మరియు డ్రైనేజీల వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు జంగారెడ్డిగూడెం పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రూ. 101 కోట్లతో మంచినీటి వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని నాయకులు వెల్లడించారు. త్వరలోనే పట్టణంలోని అన్ని 29 వార్డులకు మంచినీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు షేక్ రషీద్, కొడవటి సత్యనారాయణ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొండ్రెడ్డి కిషోర్, కోనేటి చంటి, అలాగే కంపా రాజేంద్ర, నంబూరు రామచంద్ర రాజు, వెంపల రాజు, మండవ లక్ష్మణరావు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రావూరి కృష్ణ, బొబ్బర రాజ్ పాల్ కుమార్, షేక్ ముస్తఫా, పెనుమర్తి రామకుమార్, మారిశెట్టి సత్యనారాయణ, చిట్రోజు తాతాజీ, ఈడ శ్రీనివాస్, గుమ్మడి ప్రసాద్, పాతూరి అంబేద్కర్, చెరుకూరి శ్రీధర్, మానికల నాగేశ్వరరావు, దాకారపు కృష్ణ, తూటుకుంట రాము, బలరాం రాంబాబు, గడిగోయల రాధాకృష్ణ, నంగులూరి జగత్ కుమార్, కంచర్ల గణేష్, గొల్లపూడి శ్రీదేవి, తానిగడప సుమలత, షేక్ సమీరా, మాదగాని ప్రియాంక మనోజ్ తదితరులు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండుబోట్లవారిపాలెంలో " ఇంటింటికి తెలుగుదేశం " కార్యక్రమం

**బాపట్ల : జూలై 27 ( ప్రజా వీక్షణం )**

సోమవారం బాపట్ల నియోజకవర్గం బాపట్ల మండలం కేబి పాలెం గ్రామం 121వ బూత్ లో బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం " రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం "పథకాల గురించి ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా 121వ బూతు లో 30 ఇళ్ళను సందర్శించి వారికి అభివృద్ధి సంక్షేమం గురించి చర్చిస్తూ మై టిడిపి యాప్లో కుటుంబ సభ్యుల ఫోటోలను అప్లోడ్ చేశారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో 30 ఇళ్లను సంపూర్తిగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ,కేబి పాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు మద్దుల కొండలు గ్రామ పార్టీ సెక్రెటరీ బడుగు. లుదియ, పసుమర్తి. ఆనంద్,పల్లం జీవన్, డొప్పలపూడి. జయమ్మ,బూతు ఇంచార్జి మార్పు ప్రతాప్, మండల తెలుగు యువత అధ్యక్షులు మార్పు ఆనంద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# బాపట్లలో ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో ప్రారంభమైన

### "రెండేళ్ల నమ్మకం - సంక్షేమం - అభివృద్ధి" కార్యక్రమం!

**బాపట్ల : జూలై 27 ( ప్రజా వీక్షణం )**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు,బాపట్ల నియోజకవర్గం,బాపట్ల మండలం,చుండూరుపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన "రెండేళ్ల నమ్మకం - సంక్షేమం - అభివృద్ధి" ఇంటింటికీ కార్యక్రమాన్ని సోమవారం బాపట్ల ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి,గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు మరియు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వ సాధనలతో కూడిన కరపత్రాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు,బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు,ముక్కామల సాంబశివరావు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# బిజీ షెడ్యూల్‌లోనూ ప్రజా సేవకే తొలిపీఠం ....





### స్వయంగా లెటర్లు టైప్ చేసి అందించిన చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్!

**చింతలపూడి:జులై 27(ప్రజా వీక్షణం)**

పదవి అనేది ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన ఒక గొప్ప అవకాశమని నిరూపించారు చింతల పూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్ప టికీ, కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఏ ఒక్క చిన్న అసౌకర్యం కూడా కలగకూడదనే ఉద్దేశంతో ఆయన చూపిన చొరవ ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కార్యాలయ కంప్యూ టర్ ఆపరేటర్ సతీమణి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతు ండటంతో ఆపరేటర్ విధులకు హాజరుకాలేకపోయారు. అదే సమ యంలో పలు పనుల నిమిత్తం, సిఫార్సు లేఖల కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యాలయానికి వచ్చారు. సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడటం, సమయం వృధా అవ్వడం గమనించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ క్షణం కూడా ఆలోచించ లేదు. సమ యం ఎంతో విలువైందని భావించి, తన వద్ద ఉన్న బిజీ షెడ్యూల్‌ను పక్కనపెట్టి స్వయంగా కంప్యూటర్ ముందు కూర్చుని ప్రజలకు కావలసిన లెటర్లను స్వహస్తా లతో టైప్ చేసి అందించారు."ప్రజల సేవే ప్రథమ కర్తవ్యం. ప్రతి చిన్న సమస్యకూ వెంటనే స్పందించాలి అంటూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు." అనే నినాదానికి ఈ సంఘటన నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. ప్రజాప్రతినిధి అంటే కేవలం హామీలు ఇవ్వడమే కాదు, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించే గుణం ఉండాలని నిరూపించిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పై స్థానిక ప్రజలు, నాయకులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# కొత్త బోరు వద్ద విషాదం :...విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి!

### ఆషాఢం తర్వాత పెద్ద కుమార్తె వివాహం ఉందనగా తెడ్లంలో విషాద ఛాయలు

**టీ. నర్సాపురం తెడ్లం:జులై 27(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం తెడ్లం గ్రామంలో సోమవారం నాడు తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయం కోసం అమర్చుకున్న విద్యుత్ లైన్ సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి (కరెంట్ షాక్) గురై చవట అప్పారావు (43) అనే కౌలు రైతు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు మరియు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... అప్పారావు ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం జీవనాధారంగా జీవిస్తున్నారు. పొలానికి నీటి వసతి కోసం ఇటీవల కొత్తగా బోరు వేయించారు. ఈ క్రమంలో బోరుకు సంబంధించి ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, విద్యుత్ సర్వీస్ వైర్ లోపం తలెత్తింది. ఆ వైర్‌ను సరిచేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఊహించని విధంగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహాన్ని ఆషాఢ మాసం పూర్తయిన వెంటనే ఘనంగా జరిపించేందుకు కుటుంబ సభ్యులు నిశ్చయించారు. పెళ్లి బాధ్యతలు పూర్తిచేయాల్సిన తండ్రి, ఇలా హఠాత్తుగా కన్నుమూయడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. కుటుంబంలో వెలుగులు నింపాల్సిన సమయంలో ఈ ఘోరం జరగడంతో తెడ్లం గ్రామంలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. ?మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం, స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



# అబ్దుల్ కలాం వర్ధంతి సందర్బంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు అందజేసిన రజని





**బాపట్ల : జూలై 27 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల పట్టణంలోని రెల్లి కాలనీలో ఉన్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాల నందు సోమవారం సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజని భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ : ఏ.పీ. జే. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్బంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు మరియు అల్పాహారంను అందజేశారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ ,ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నా రు.

## బస్వాపురంలో ఇంటింటికి మొక్కల పంపిణీ..

దేవరకద్ర జులై 27 ప్రజావిక్షణం

మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సోమనము ప్రజలకు స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కూడా ఇంటి వద్ద మొక్కలు నాటాలని సర్పంచ్ కోరారు.



## ఎంఆర్ పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మార్కెట్ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ సంఘం నాయకులు..

దేవరకద్ర జులై 27 ప్రజా విక్షణం

మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు ను సోమవారం మండల ముదిరాజ్ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు . ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## వీరబ్రహ్మేంద్రస్వామి, కామాక్షి అమ్మవారిని దర్శించుకున్న వడ్డీ రఘురామ్ నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 27 (ప్రజా వీక్షణం)

పెంటపాడు మండలంలోని పెంటపాడు గ్రామంలో కొలువైన వీరబ్రహ్మేంద్రస్వామి, కామాక్షి అమ్మవారి ఆలయాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. అనంతరం భక్తులతో, స్థానిక ప్రజలతో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు



## దేవరకద్రలో 4న బోనాల పండుగ..

దేవరకద్ర జులై 27 ప్రజా వీక్షణం

మండల కేంద్రంలో వచ్చేనెల 4న బోనాల పండుగ నిర్వహించాలని గ్రామ పెద్దలు సోమవారం నిర్ణయించారు. స్థానిక ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద బోనాల పండుగకు సంబంధించి సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశంలో ఒక వర్గం కు చెందినవారికి ఇటీవల వాళ్ళ వారి కులస్తులు చనిపోవడంతోబోనం ఎత్తడానికి రాదని పెద్దలు చెప్పారు. అందుకోసం కురువ యాదవ సంఘం నాయకుల వచ్చే నెల 4న బోనాల పండుగ కొనసాగిద్దామని తెలిపారు. అందుకు అందరూ ఓకే అన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# నారా భువనేశ్వరి పర్యటన : కెంచనబల్లలో టీడీపీ నేత కుటుంబంతో మమేకం..





### పాఠశాల విద్యార్థులతో ముచ్చట్లు

కుప్పం, రామకుప్పం మండలం:జులై 27 (ప్రజా వీక్షణం)

కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటన ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా రామకుప్పం మండలం కెంచనబల్ల గ్రామంలో ఆమె పర్యటించి స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.కెంచనబల్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) యూనిట్ ఇంచార్జ్ చంద్రశేఖర్ రెడ్డి కుటుంబాన్ని నారా భువనేశ్వరి స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అత్యంత ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకు న్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామనే భరోసానిచ్చారు.ఈ పర్యటనలో భాగంగా కెంచనబల్లలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జ్ఞానప్రదాత అయిన సరస్వతీ దేవికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం, పచ్చదనాన్ని పెంపొందించే సందేశంతో స్కూలు ఆవరణలో స్వయంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు.అనంతరం సింగసముద్రం ప్రాంతంలో నారా భువనేశ్వరి విద్యార్థులతో ముచ్చటించారు. వారి చదువుల గురించి, పాఠశాలలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు భవిష్యత్తుపై ధైర్యం చెబుతూ, బాగా చదువుకుని గొప్ప ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆమెతో ముచ్చటించడం పట్ల ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

# రూ.1.20 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి నారా లోకేష్!







పెనమలూరు జులై 27(ప్రజా వీక్షణం)

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం పునాదిపాడులో సోమవారం నాడు నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనా న్ని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘనంగా ప్రారంభిం చారు. పోలవరపు మాధవరావు మరి యు వారి కుటుంబ సభ్యులు సమకూ ర్చిన రూ. 1.20 కోట్ల భారీ విరాళంతో ఈ నూతన భవనం రూపుదిద్దు కుంది.ఈ ప్రారంభోత్సవ వేడుకలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తదితర ప్రముఖులు హాజరయ్యారు. విద్యారంగ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.

# ఎట్టకేలకు మోక్షం.. 20 ఏళ్ల కల సాకారం!

### చింతలపూడి -- బాలవారిగూడెం రహదారి నిర్మాణానికి రంగం సిద్ధం

### రూ.2.80 కోట్ల వ్యయంతో 4 కిలోమీటర్ల మేర పనులు ప్రారంభం

### స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పరిశీలన

చింతలపూడి జులై 27(ప్రజా వీక్షణం ):

దాదాపు 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న చింతలపూడి -- బాలవారిగూడెం రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. రవాణా సౌకర్యాలు లేక ఏళ్లుగా పడుతున్న ఇబ్బట్లకు త్వరలోనే తెరపడనుం డటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రూ. 2.80 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 4 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నా యి. ఈ నేపథ్యంలో, చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ కాంట్రాక్టర్ స్థానిక నాయకు లు మరియు కార్యకర్తలతో కలిసి నేరుగా నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిం చారు. పనుల నాణ్యత, చేపట్టాల్సిన విధానంపై అధికారులకు తగు సూచనలు అందజేశారు.ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రవాణా సౌకర్యాలు ఎంతో మెరుగుపడతాయి.చుట్టుపక్కల గ్రామాల మధ్య రాకపోకలు సాగించడం మరింత సులభతరమై, అనుసంధానం బలోపేతం కానుంది.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తోంది. అని అలాగే "అభివృద్ధే లక్ష్యం... ప్రజల సౌకర్యమే ధ్యేయం!" అని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పునరుద్ఘాటించారు.



# నందిగామలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

## - అమరవీరులకు ఘన నివాళి

**నందిగామ జులై 27:(ప్రజా వీక్షణం)**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని చైతన్య ఏసీ క్యాంపస్‌లో భారత సాయుధ దళాల వీరత్వాన్ని, వారి అత్యున్నత త్యాగాలను స్మరించుకుంటూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో జూలై 26 కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఒక ప్రత్యేక సదస్సును ఘనంగా నిర్వహించారు. బీజేపీ యువజన విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొటిక శివకృష్ణ రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శివకృష్ణ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, 1999 కార్గిల్ యుద్ధం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ యుద్ధంలో భారత సైన్యం పాకిస్థాన్ చొరబాటుదారులను సమర్థవంతంగా తిప్పికొట్టి, దేశ ప్రాదేశిక సమగ్రతను ఎలా కాపాడిందో తెలిపారు. సంఘర్షణ సమయంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన ధైర్యం, దేశభక్తి మరియు దృఢ సంకల్పం గురించి కొనియాడుతూ, విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన 527 మంది వీర జవాన్లకు ఆయన ఘన నివాళులర్పించారు. దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణ మరియు నిస్వార్థ సేవా భావాలను యువత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్గిల్ వీరుల త్యాగాలు ప్రస్తుత మరియు భావి తరాలకు అంకితభావంతో దేశానికి సేవ చేసేలా ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉండాలని ఆయన పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కళాశాల




ప్రిన్సిపాల్ అమరనేని కార్తీక్ ప్రత్యేకంగా అభినందించారు. భారత సైనికుల ధైర్యం మరియు అంకితభావం నుండి స్ఫూర్తి పొందాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువజన విభాగం నాయకులు సాయి విష్ణుతో పాటు పార్టీ నాయకులు సీతారామయ్య, కామేశ్వరరావు, కేదార్‌నాథ్ శర్మ, సాంబశివరావు, సుందరరావు, మరియు ఇతర పార్టీ నాయకులు, విద్యార్థులు, అధ్యాపకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# పోలవరం డిఎస్పీగా కె.జై కృష్ణ బాధ్యతలు స్వీకరణ!

## ఏలూరు జిల్లాలో కొత్త కోణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం అందుబాటులో ఉంటామని వెల్లడి

**పోలవరం జులై 27(ప్రజా వీక్షణం):**



ఏలూరు జిల్లాలోని పోలవరం నియోజకవర్గం పరిధిలోని పోలవరం మండలంకు నూతన డీఎస్పీ కె.జై కృష్ణ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను కట్టుదిట్టం చేయడమే తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు.ప్రజలకు పోలీసు శాఖకు మధ్య సత్సంబంధాలు పెంపొందించేలా కృషి చేస్తానని, ఎవరికైనా సమస్యలు ఉంటే నిరభ్యంతర ంగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకు ంటామని ఆయన పేర్కొన్నా రు.నూత నంగా బాధ్యతలు చేపట్టిన డిఎస్పీ జై కృష్ణకి పలువురు పోలీసు అధికారులు, స్థానిక ప్రముఖులు మరియు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా అభినందనలు తెలిపారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం





## కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాజ్జి)

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 27**

**(ప్రజా వీక్షణం)**

ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమవుతుందని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాజ్జి) తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనపైతాడేపల్లిగూడెం మండలంలోని నందమూరు, పెంటపాడు మండలంలోని అల్లంపురం గ్రామాల్లో సోమవారం ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వలవల మల్లికార్జునరావు (బాజ్జి) ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, రైతులు, మహిళలు, యువత, కార్మికుల కోసం చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించటంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు (బాజ్జి) మాట్లాడుతూ నియోజకవర్గంలో తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గ్రామం నందమూరేనని, ఈ గ్రామం నుంచే తెదేపా ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించటం ఎంతో ఆనందదాయకంగా ఉందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన అన్ని వాగ్దానాలను అమలుజేస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకురావడంతోపాటు పంచాయతీలకు నిధులిచ్చి అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధ్వాన్నంగా తయారైన రహదారులను కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దిందని చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులిచ్చి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారని కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టుతో రాయలసీమ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని చెప్పారు. ప్రభుత్వ పనితీరును ప్రతి ఇంటికి చేర్చడం ద్వారా ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామని తెలిపారు. పార్టీ నాయకు లు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతులు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పథకం అర్హులైన ప్రతి ఇంటికీ చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. గతంలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులను మళ్లీ వేగవంతం చేశామని చెప్పారు. రైతులకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో పరిమి రవి కుమార్, కిలపర్తి వెంకట్రావు, ఆకాశపు స్వామి, బండారు వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, శనగన శ్రీనివాస్ గౌడ్, వట్టూరి రాంబాబు, పారిచర్ల ప్రసాద్, చుండ్రు రాంబాబు, బెజవాడ శ్రీను, ముప్పిడి రమేష్, నారాయణ, అంజూరి శ్రీను, రేవల్ల సోమరాజు, చిటికన శ్రీనివాస్, పరిమి వీరభద్ర రావు, వెలిగట్ల రాము, పుట్టా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 30న రక్తదాన శిబిరం

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రశేఖరం

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 27 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.చంద్రశేఖరం సోమవారం తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభిస్తారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎం. ప్రభాకర్ పర్యవేక్షణలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్ట ఆయన వివరించారు.



# అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా జర్నలిస్ట్ రాజా రమేష్ ఘన నివాళులు

**బాపట్ల జులై 27 ( ప్రజా వీక్షణం )**

శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన క్షిపణి పితామహుడు, భారతరత్న,మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా జర్నలిస్ట్ రాజా రమేష్ ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డా. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాజా రమేష్ మాట్లాడుతూ.. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో,భారత అంతరిక్ష మరియు క్షిపణి సాంకేతికత అభివృద్ధిలో డా.అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నిరాడంబర జీవితం, క్రమశిక్ష ణ,దేశభక్తి ,యువ తపై అపారమైన నమ్మకంతో ఆయన భారతీయుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపో యారని పేర్కొన్నారు. కలలు కనండి..ఆ కలలను సాకారం చేసుకునేందుకు కష్టపడి పనిచేయండి" అంటూ దేశ యువతకు స్ఫూర్తినిచ్చిన డా.ఏ.పీ.జే.అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని రాజా రమేష్ అన్నారు.దేశాభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మహనీయుడు డా.ఏ.పీ.జే. అబ్దుల్ కలాం ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఘనంగా నివాళులర్పించారు.



# జలసిరిని ఉద్యమంగా చేపట్టాలి



## అదనపు కలెక్టర్ ఇన్‌చార్జ్ శేషాద్రి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమాన్ని



గ్రామస్థాయిలో ప్రజా ఉద్య మంగా తీర్చిదిద్దాలని అద నపు కలెక్టర్ ఇన్‌చార్జ్ శేషాద్రి పిలుపునిచ్చారు. హసన్‌పర్తి టీటీడీసీ శిక్షణ కేంద్రంలో గ్రామైక్య సంఘా ల మహిళలకు నిర్వహించి న శిక్షణలో ఆయన మాట్లా డుతూ, ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల ను పరిరక్షించాల్సిన అవస రం ఉందన్నారు. ప్రతిగ్రా మైక్య సంఘం ఇద్దరు రైతు లను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, చెరువుల పూడి కతీత వంటి పనులను ఎదీ=వీ+ూ పథకం ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామైక్య సంఘాల మహిళ లు నీటి సంరక్షణపై గ్రామా ల్లో విస్తృత అవగాహన కల్పించాలని డీఆర్‌డీఓ మేన శ్రీను సూచించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# అమరావతి ఛాంపియన్‌షిప్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

## డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎం.ప్రభాకర్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 27 (ప్రజా వీక్షణం)**

ఈ నెల 29 నుంచి నిర్వహించనున్న అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎం.ప్రభాకర్ సూచించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులతో అమరావతి ఛాంపియన్షిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో వి.చంద్రశేఖరం అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రభాకర్ మాట్లాడుతూనియోజకవర్గ స్థాయిలో అండర్-17, అండర్-23 విభాగాల క్రీడాకారులతో స్పోర్ట్స్ మీట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. ఈ నెల 30న తాలూకా ఆఫీస్ కూడలిలోని షటిల్ కోర్టు (రైతు బజార్)లో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభిస్తారని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన యువత నుంచి ఇప్పటికే ఆహ్వానాలు కోరామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పీఎంకే జ్యోతి,వ్యాయామ క్రీడల సమన్వయకర్త డి. శేఖర్‌బాబు, ఏ.ఈశ్వర్‌తో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

## చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు

## డీఎంహెచ్ఓ డా. ఏ. అప్పయ్య

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం అమలు పై అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తూ, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ. అప్పయ్య తెలిపారు. జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమా వేశంలో బాలికల నిష్పత్తి, స్కానింగ్ కేంద్రాల పర్య వేక్షణ, డెకాయ్ ఆపరేషన్ల పై సమీక్షించారు. అక్రమ లింగ నిర్ధారణపై ఖచ్చిత మైన సమాచారం అందిం చిన వారికి రూ.50 వేల ప్రోత్సాహకం అందజేస్తామ ని తెలిపారు. మొబైల్ స్కానింగ్ యంత్రాలు లేదా అక్రమ లింగ నిర్ధారణపై సమాచారం ఉంటే 6300030940కు తెలియజేయాలని డీఎంహెచ్ఓ విజ్ఞప్తి చేశారు.



# హసన్ పర్తి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సీపీ ఎన్. శ్వేత

## ప్రజలకు మర్యాద పూర్వక సేవలందించాలి

## అధికారులకు ఆదేశం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 27 ( ప్రజా వీక్షణం న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సోమవారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ను సందర్శించి స్టేషన్ నిర్వ హణ, రికార్డులు, శాంతి భద్రతల పరిస్థితిని సమీ క్షించారు. ప్రజలతో మర్యా దగా వ్యవహరించి ప్రతి ఫిర్యాదుకు రశీదు ఇవ్వాల ని, రౌడీషీటర్లపై కఠిన చర్య లు తీసుకోవాలని, మహిళ లపై నేరాలకు వెంటనే స్పందించాలని, చోరీల నియంత్రణకు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజ ల్లో అవగాహన కల్పించాల ని పోలీసు అధికారులకు సీపీ ఆదేశించారు.




# సర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి

## ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

హసన్‌పర్తి లో నిర్వహిం చిన సర్ సమీక్ష సమావేశం లో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నా రు. సర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని, అర్హులైన ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్‌ఏలు బాధ్యతగా వ్యవహరించాలని సూచిం చారు. ఓటు హక్కు ప్రజా స్వామ్యానికి కీలకమని, ప్రతి అర్హుడికి ఓటు ఉండే లా పార్టీ శ్రేణులు సమన్వ యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమా వేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్య కర్తలు పాల్గొన్నారు.




# పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ పంచాయతీ కార్మికుల ధర్నా

## పెంటపాడు ఎంపీడీవో రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేత

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 27 (ప్రజా వీక్షణం)**

పెండింగ్ జీతాల చెల్లింపు, జీవో 680 అమలు, కనీస వేతనం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధన కోసం సోమవారం పెంటపాడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, సీపీఐ నాయకుడు కొనతల నాగరాజు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదని, జీవో 680 అమలు కాకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, భద్రతా పరికరాలు కల్పించాలని, రాజకీయ వేధింపులు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగితే జిల్లా స్థాయిలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో పి.వి.వి.ఎస్. రాంప్రసాద్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోన రాజేష్, బొర్సెట్టి లక్ష్మి, సీహెచ్ రాజు, కోలా రామకృష్ణ, మట్ట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

## కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

## ప్రజావాణిలో 264 అర్జీల స్వీకరణ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 37 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధిం చిన 264 అర్జీలు స్వీకరిం చి సంబంధిత శాఖలకు పంపించారు. అలాగే ఎల్‌నీ నో ప్రభావం నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, జలసిరి కార్య క్రమం, వర్షపు నీటి సంర క్షణపై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆర్డీవోలు, తహసీల్దార్లతో వర్చువల్ సమీక్ష నిర్వ హించి పెండింగ్ వినతుల ను త్వరితగతిన పరిష్క రించాలని సూచించారు.



# కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ

**బాపట్ల ( చీరాల ) : జూలై 27 ( ప్రజా వీక్షణం )**

సోమవారం కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా చీరాల మండలంలోని దేవాంగపురి గ్రామంలో నివాసం ఉంటున్న బుద్ది ఉమామహేశ్వరరావుకి గుండె స్టంట్ వేయడం వల్ల ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని కృతి ఫౌండేషన్ ను సహాయం అడగగా వారి కుటుంబానికి రెండు నెలలకు సరిపడా బియ్యం మరియు నిత్యవసర సరుకులను ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకటఅశ్విని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చీరాల కో - ఆర్డినేటర్ మలిపెద్ది వీరబాబు,కరేడు కో - ఆర్డినేటర్ బొమ్మిరెడ్డి యశ్వంత్,చీరాల వాలంటీర్లు అజయ్,అయ్యప్ప,చిరంజీవి పాల్గొన్నారు.



# ఆరో రోజుకు చేరిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన

## నల్ల దుస్తులతో నిరసన తెలిపిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 27 (ప్రజా వీక్షణం)**

రాష్ట్ర ప్రభుత్వ విశ్వ విద్యాలయాల్లో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రాబోయే అధ్యాపకుల నియామకాల్లో కాంట్రాక్ట్ సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న ఆందోళన సోమవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ ఆందోళనలో భాగంగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నల్ల దుస్తులు ధరించి శాంతియుత నిరసన చేపట్టారు. నల్ల దుస్తులు తమ ఆవేదనకు ప్రతీక అని, విశ్వ విద్యాలయాల అభివృద్ధికి ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ ఉద్యోగ భద్రత, సేవలకు గుర్తింపు, తగిన వేతనం లభించకపోవడంపై తమ నిరసనను వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రాబోయే అధ్యాపకుల నియామకాలకు ముందు ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సేవలను గుర్తించి క్రమబద్ధీకరించాలని, రాబోయే నియామక ప్రక్రియలో వారి సేవా కాలాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ఉపాధ్యక్షుడు డా. హీరా బట్టు నాయకత్వం వహించగా, సంయుక్త కార్యదర్శి డా. పి. ప్రశాంతి, సభ్యులు లిఖిత, శ్రీరాముడు, బాబులు, డా. ఎఫ్రైమ్ బాబు, డా. పుత్రయ్య, డా. రమణ, డా. సురేష్, డా. ప్రదీప్, డా. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# సిద్ధాపూర్, వంగపాడు లో బెల్ట్ షాపులపై హసన్ పర్తి పోలీసుల మెరుపు దాడులు

## ముగ్గురిపై కేసులు నమోదు - అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపూర్, వంగపాడు గ్రామాల్లో అక్రమంగా నిర్వ హిస్తున్న బెల్ట్ షాపులపై హసన్‌పర్తి పోలీసులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయి స్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, సిద్ధాపూ ర్, వంగపాడు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తు న్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టా రు. తనిఖీల్లో తాబేటి యు గేందర్, ముస్కు శ్రీనాథ్, నరసింహులు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి, వారిపై సంబంధి త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపా రు. ఈ సందర్భంగా హసన్ పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, గ్రామాల్లో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ప్రభుత్వ నిబంధ నలను ఉల్లంఘించిమద్యం విక్రయాలు జరిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించ బోమని స్పష్టం చేశారు.అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగి స్తారని, ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్ విజ్ఞప్తి చేశారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

# వీడియో జర్నలిస్ట్ వర్ధన్ ఆత్మహత్య కేసులో నిందితులు అరెస్ట్

**విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డిఎస్పి రవిచంద్ర**

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 27 (ప్రజా వీక్షణం)**

రాష్ట్రంలో సంచలనం కలిగించిన జర్నలిస్ట్ ఉర్ల బాలకృష్ణ వర్ధన్ ఆత్మహత్య కేసులో నిందితులిద్దరిని అరెస్ట్ చేశామని తాడేపల్లిగూడెం డిఎస్పి రవిచంద్ర తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన వీడియో జర్నలిస్ట్ ఉర్ల బాలకృష్ణ వర్ధన్ మృతికి సంబంధించిన సెల్ఫీ వీడియో ఆధారంగా ప్రధాన నిందుతులు ఇద్దరని అరెస్ట్ చేశామని తెలిపారు. రచ్చ మీడియా సంస్థలో వీడియో జర్నలిస్ట్ గా పనిచేస్తున్న ఉర్ల బాలకృష్ణ వర్ధన్ కు సంస్థ నిర్వాహకులు జీతం ఇవ్వకపోవటంతోపాటు, కుల దూషణ, సోషల్ మీడియాలో వేధింపులకు గురి చేయటం వంటి అంశాల నేపథ్యంలో మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. సోషల్ మీడియాలో దూషించుకోవడం వలన మనస్థాపం చెందిన జర్నలిస్ట్ వర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని, తన మృతికి రచ్చ మీడియా తమ్మిశెట్టి రంగా సురేష్, దేవా వెంకట శివ కారణమని సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మృతుడు తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని కులం పేరుతో దూషించడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందుతులను కోర్టుకు హాజరు పరుస్తామని, కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ఆది ప్రసాద్, ఎస్ఐ బాదం శీను పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి -నేడు ఆయన వర్ధంతి

సూదిని జైపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాడుగులలో 1942, జనవరి 16న జన్మించారు. 18 నెలల వయసులో పోలియో కారణంగా వైకల్యానికి గురయ్యారు. జైపాల్ రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఎ. పట్టా పొందాడు. ఈయన కల్వకుర్తి శాసనసభ నియోజకవర్గం నుండి 1969, 1984 మధ్య నాలుగు సార్లు ఆంధ్ర ప్రదేశ్ శాసన సభకు ఎన్నికయ్యాడు. ముందుగా కాంగ్రెసు పార్టీ సభ్యునిగా ఉన్నా, అత్యవసర పరిస్థితి నివ్యతిరేకిస్తూ 1977లో జనతా పార్టీలో చేరాడు. ఆ పార్టీలో 1985 నుండి 1988 వరకు జనరల్ సెక్రటరీగా వ్యవహరించాడు. ఇతను భారత పార్లమెంటుకు మొదటిసారిగా 1984లో మహబూబ్‌నగర్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాడు. తరువాత భారత పార్లమెంటుకు మిర్యాలగూడ లోకసభ నియోజకవర్గం నుండి భారత జాతీయ కాంగ్రెసు అభ్యర్థిగా 1999, 2004లలో రెండు సార్లు ఎన్నికయ్యాడు. రాజ్యసభ సభ్యునిగా 1990, 1996 లలో రెండు సార్లు ఎన్నుకోబడ్డాడు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా 1991-1992 లో ఉన్నాడు. రెండు సార్లు సమాచార, ప్రసార శాఖా మంత్రిగా పనిచేశాడు. జైపాల్ రెడ్డి చట్ట సభలలో చేసిన డిబేట్లు అత్యంత కీలకమైనవిగా ఉంటాయి. ఇతను అత్యుత్తమ పార్లమెంటేరియన్ గా 1998లో ఎన్నుకోబడ్డాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కష్టపడి కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ప్రభావితం చేసి సోనియాగాంధీ ని ఒప్పించి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేసేలా కృషి చేశారు. జైపాల్ రెడ్డి హైదరాబాదు గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీలో చికిత్స పొందుతూ 2019, జూలై 28 తెల్లవారుజామున గం. 1.28 ని.లకు మరణించారు.



# విద్యార్థులపై దాడికి అమిత్ షా క్షమాపణలు చెప్పాలి: చామల

**న్యూఢిల్లీ,జూలై27( ప్రజా వీక్షణం ):**

విద్యార్థులపై జరిగిన అమానుష దాడికి కేంద్ర హోంమంత్రి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మిడియాతో మాట్లాడారు 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో అంతా అయిపోయిందని కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపు కుంటే ఉపేక్షించేది లేదు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలంటే ప్రభుత్వం భాధ్యతతో వ్యవహరించాలి. సింగపూర్, బ్రిటన్ లాంటి దేశాల్లో జెన్‌జీకి చట్టసభల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. భారత్‌లో కూడా 21 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న యువతకు చట్టసభలో ప్రాతినిద్యం కల్పిస్తే.. వారి సమస్యలపై పూర్తి అవగాహనతో చర్చించి, సమస్యలు పరిష్కారం చేయవచ్చు. ఈ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని ఇండియా కూటమి నేతలకు తెలంగాణ ముఖ్యమంత్రి వివరించనున్నారు' అని చామల తెలిపారు.

# గిరిజనుల బిడ్డల బతుకులు బురదపాలైతే పట్టించుకోని మండల అధ్యక్షుడు అడపా నాగరాజు....

**కూటమి నేత పూసం అంజిబాబు ఎదుట కన్నీటిపర్యంతమైన గిరిజనులు!**

**సాలిగూడెం గ్రామానికి రోడ్డు లేదు.. ఆసుపత్రి లేదులి .... బడి పిల్లలకు కనీసం వాటర్ కుళాయి సదుపాయం కూడా లేక చుక్క నీరు దొరకక అల్లాడుతున్న వైనం ..**

**గపప గడప కార్యక్రమంలో కూటమి సీనియర్ నేత పూసం అంజిబాబు..**

**టీ. నర్సాపురం, (సాలిగూడెం): జులై 27: (ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం సాలిగూడెం గ్రామంలో గిరిజనుల దుస్థితి అక్షరాలా కంటతడి పెట్టిస్తోంది. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటూ, కనీస సౌకర్యాలకు నోచుకోక అల్లాడుతున్న సాలిగూడెం గ్రామ గిరిజనుల గోడు ఎట్టకేలకు వెలుగులోకి వచ్చింది. కూటమి సీనియర్ నాయకుడు, గిరిజన ఆదివాసీ నేత పూసం అంజిబాబు సోమవారం రాత్రి 7 గంటల సమయంలో సాలిగూడెం గ్రామంలో పర్యటించి గడపగడపకూ తిరిగిన సమయంలో ఈ దారుణ పరిస్థితులు బట్టబయలయ్యాయి. "మాకు రోడ్డు లేదు.. వర్షమొస్తే నడిచే దిక్కులేదు.. ప్రాణం పోతే ఆసుపత్రికి చేర్చే పరిస్థితి లేదు.. కనీసం తాగడానికి గుక్కెడు మంచి నీళ్లు కూడా దొరకని దుస్థితి ఏర్పడింది. అసలు గ్రామంలోని పాఠశాలలో ఒకటి నుండి ఐదవ తరగతి వరకు చదువుతున్న చిన్నారులకు స్కూల్ వద్ద కనీసం వాటర్ కుళాయి కూడా లేదు.. ఇన్నాళ్లూ మా బతుకులు ఎలా పోతే మీకేంటి" అంటూ గ్రామస్తులు కూటమి నేత పూసం అంజిబాబు ఎదుట తమ దశాబ్దాల ఆవేదనను కట్టలు తెంచుకుని బయటపెట్టారు. ఇదే సమయంలో గ్రామస్తులు టీ. నరసాపురం మండల అధ్యక్షులు అయినటువంటి అడపా నాగరాజు మీద తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "ఇంత వరకు మా గ్రామానికి ఇన్ని సమస్యలు ఉంటే ఆయన ఇటు వైపు రాలేదు, మా సమస్యలు తెలుసుకోలేదు. మేము ఓట్లు వేస్తే గెలిచి ఇప్పుడు బయటకు రాకుండా ఏం చేస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తమ గ్రామ సమస్యలను పట్టించుకున్న దిక్కు మొక్కు లేదని, తమ గోడును ఆలకించిన నాథుడే



కరువయ్యాడని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి కనీసం బీటీ రోడ్డు కూడా లేకపోవడంతో, వర్షాకాలంలో మోకాలి లోతు బురదలో రాకపోకలు సాగించాల్సి వస్తోందని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదని మండిపడ్డారు. గ్రామంలో కనీస ప్రాథమిక వైద్య సేవలు లేక, చిన్న అనారోగ్యానికి గురైనా కిలోమీటర్ల దూరం నడవాల్సిన దుస్థితి నెలకొందని వాపోయా రు.గ్రా మస్తుల దుస్థితిని కళ్లారా చూసిన ఆదివాసీ గిరిజన నాయకుడు పూసం అంజిబాబు ఈ సందర్భంగా మాట్లాడు తూ "గిరిజన బిడ్డల బతుకుల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని అన్నారు. అలాగే ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి మీ సమస్యలను స్వయంగా నేనే తీసుకెళ్తా అని, అంతేకాకుండా సాలిగూడెం గ్రామానికి వెంటనే రోడ్డు సౌకర్యం, తాగునీటి సమస్య పరిష్కారం, స్కూలు పిల్లలకు తాగునీటి వసతి, శాశ్వత వైద్య సేవలు అందేలా చేసి, గ్రామానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు నా పోరాటం ఆపను అని హెచ్చరికపూర్వకంగా, ధైర్యంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తాటి రాము, ముచ్చా మల్లికార్జున, తాటి రాములు, బొద్దుమ్ రాముడు, సంక్రుడు, కనకయ్య, నాగరాజు, బన్నే చెల్లమ్మ, బొద్దుం దుర్గమ్మ,వెంకమ్మ, శ్రీను, బుద్ధుల సీతమ్మ, మోడియం కనకమ్మా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అధ్యక్షునికి ఘనంగా సన్మానం,

**దేవరకద్ర జూలై 27 ప్రజావి క్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొబ్బలి ఆంజనేయులు ని ఎన్నుకున్న సందర్భంగా ఘనంగా సన్మానించిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరకద్ర టౌన్ ప్రెసిడెంట్ మున్నూరు బాలరాజ్ ఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ మాజీ ముడా చైర్మన్ కర్ణం



రాజు మాజీ ఎంపిటిసి ఉష్కిల్లా



వెంకట్ రాములు సాగర సంగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పరి సత్యం మాజీ వార్డ్ మెంబర్ గోపాల్ నారాయణ రాజు బాలు రాజు నాగరాజు తదితులు ఘనంగా సన్మానం చేశారు.

# రేచిని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూటీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం

**ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలి: జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు**

**తాండూరు; ప్రజా వీక్షణం**

మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూటీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలువురు ఉపాధ్యాయులు రాష్ట్రోపాధ్యాయ సంఘంలో సభ్యత్వం స్వీకరించి సంఘ బలోపేతానికి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భట్టారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రోపాధ్యాయ సంఘం గత 80 సంవత్సరాలుగా విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సంఘం అనేక ఉద్యమాలు చేపట్టిందని, భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం మరింత బలంగా పోరాటం కొనసాగించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు సంఘంలో సభ్యత్వం తీసుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో 2024 సంవత్సరం వేసవి శిక్షణ తరగతులకు సంబంధించిన సంపాదిత సెలవులు (ఈఎల్‌లు) ఇప్పటికీ మంజూరు కాకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. సంబంధిత మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఈఎల్‌లను ఉపాధ్యాయులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ)





బకాయిలను వెంటనే ప్రకటించాలని, వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను విడుదల చేసి కొత్త వేతన సవరణను అమలు చేయాలని కోరారు. అలాగే భవిష్య నిధి (జీపీఎఫ్), నూతన పెన్షన్ విధానం (సీపీఎస్), సంపాదిత సెలవులు (ఈఎల్) తదితర పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానా న్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతను ప్రభుత్వం కాపాడాలని ఆయన కోరారు .ఈ కార్యక్రమంలో రవిబాబు, కృష్ణగౌడ్, రాజేంద్రప్రసాద్, సంతోష్, శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, సుకుమాంజలి తదితర ఉపాధ్యాయులు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రత్నాపూర్ అభివృద్ధికి సహకరించండి

**కమాన్ పూర్ ప్రజా వీక్షణం జూలై 27.**

రత్నాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని, అలాగే రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఇండ స్ట్రియల్ పార్కులో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలని రత్నాపూర్ గ్రామ సర్పం చ్ పల్లె ప్రతిమ పీవీరావు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. అలాగే రామగిరి ఖిల్లా పరిసర ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ని విజ్ఞప్తి చేశారు. వినతిపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందిస్తూ రత్నాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. గ్రామంలో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో స్థానిక యువతకు ఎక్కువ సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు .మంత్రి ఇచ్చిన హామీతో గ్రామాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయకులు, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్య వ్యవస్థను బలోపేతం చేయాలి

(హెచ్.ప్రతాప్)

దేశ అభివృద్ధికి ఆరోగ్యవంతమైన సమాజం అత్యంత కీలకం. అయితే భారతదేశ జనాభాలో దాదాపు రెండు మూడవ వంతు మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ, నాణ్యమైన వైద్య సేవలు ఇప్పటికీ వారికి పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. గత కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య-సంక్షేమ కేంద్రాలు, టెలీమెడిసిన్ సేవలు, మొబైల్ వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ సేవలు, ఆశా కార్యకర్తలు, గ్రామ ఆరోగ్య సిబ్బంది ద్వారా గ్రామీణ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టాయి. ప్రసూతి సేవలు, టీకా కార్యక్రమాలు, శిశు సంరక్షణ, అంటువ్యాధుల నియంత్రణ వంటి రంగాల్లో గణనీయమైన పురోగతి కూడా కనిపిస్తోంది. అయినప్పటికీ గ్రామీణ ప్రజలకు అవసరమైన నాణ్యమైన వైద్య సేవలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. చాలా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ వైద్యుల కొరత, నిపుణులైన వైద్య సిబ్బంది లేకపోవడం, ఆధునిక వైద్య పరికరాల కొరత, మందుల లభ్యతలో అంతరాయాలు, ప్రయోగశాల సదుపాయాల లోపం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రాలు లేదా నగరాలకు రోగులను తరలించాల్సి రావడం వల్ల విలువైన సమయం వృథా అవుతోంది. ప్రమాదాలు, గుండెపోటు, పక్షవాతం, గర్భిణీల అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యంగా చికిత్స అందడం ప్రాణనష్టాలకు దారితీస్తోంది. అనేక గ్రామాల్లో నాణ్యమైన రహదారులు, ప్రజా రవాణా సదుపాయాలు పరిమితంగా ఉండటంతో వైద్య సేవలు మరింత ఆలస్యమవుతున్నాయి. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గణనీయమైన పెట్టుబడులు పెడుతున్నప్పటికీ, అవసరాలకు తగిన మౌలిక వసతులు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, దేశంలో 1,69,615 సబ్ సెంటర్లు, 31,882 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , 6,359 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పనిచేస్తున్నాయి. వీటిలో 40,583 మంది వైద్యులు ప్రాథమిక ఆరోగ్య కెంద్రాలలో లో, 26,280 మంది వైద్యులు, నిపుణులు ఛ్ఘ్ సేవలందిస్తున్నారు. అయినప్పటికీ జనాభా-సౌకర్యాల నిష్పత్తిని పరిశీలిస్తే ప్రతి గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఛ్ సగటున 35,600 మందికి, ప్రతి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం 1.64 లక్షల మందికి సేవలు అందిస్తోంది, ఇది నిర్దేశిత ప్రమాణాల కంటే ఎక్కువ భారం. అంతేకాకుండా 2021--22 గ్రామీణ ఆరోగ్య గణాంకాల ప్రకారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అవసరమైన నిపుణుల వైద్యుల్లో దాదాపు 80 శాతం కొరత కొనసాగుతోంది. శస్త్రచికిత్స నిపుణులు, గైనకాలజిస్టులు, ఫిజీషియన్లు, శిశు వైద్యుల పోస్టులు పెద్దఎత్తున ఖాళీగా ఉండటం వల్ల గ్రామీణ ప్రజలు జిల్లా లేదా నగర ఆసుపత్రులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే 1.60 లక్షలకు పైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య-సంక్షేమ కేంద్రాలను ప్రారంభించి ప్రాథమిక ఆరోగ్య సేవలను గ్రామాలకు విస్తరించినప్పటికీ, వైద్య సిబ్బంది లభ్యత, ఆధునిక నిర్ధారణ పరికరాలు, నాణ్యమైన ఆసుపత్రి మౌలిక వసతులు, అత్యవసర సేవల బలోపేతం వంటి అంశాల్లో ఇంకా గణనీయమైన పెట్టుబడులు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన సమస్య వైద్యుల కొరత. వైద్య విద్య పూర్తి చేసిన చాలామంది వైద్యులు నగరాల్లోనే సేవలందించడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనికి కేవలం వేతనాలే కారణం కావు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొనే జీవన పరిస్థితులు కూడా ప్రధాన కారణాలే. సురక్షితమైన, నాణ్యమైన నివాస వసతి లేకపోవడం, కుటుంబ సభ్యులకు అవసరమైన విద్యా సంస్థలు అందుబాటులో లేకపోవడం, పిల్లల భవిష్యత్తుపై ఆందోళన, మంచి మార్కెట్లు, బ్యాంకింగ్, సామాజిక వాతావరణం లేకపోవడం, విశ్వసనీయ ఇంటర్నెట్, మొబైల్ కనెక్టివిటీ లోపించడం వంటి అంశాలు గ్రామీణ సేవలను ఆకర్షణీయంగా మారనివ్వడం లేదు. అదనంగా ఆధునిక పరికరాలు లేని ఆసుపత్రుల్లో పనిచేయాల్సి రావడం, అవసరమైన సాంకేతిక సిబ్బంది లేకపోవడం, సేవల నిర్వహణకు తగిన మద్దతు అందకపోవడం వల్ల వైద్యులపై పని భారం పెరుగుతోంది. కొన్నిచోట్ల స్థానిక రాజకీయ జోక్యాలు, అసాంఘిక శక్తుల బెదిరింపులు, ఆసుపత్రి సిబ్బందిపై దౌర్జన్యాలు కూడా వైద్యుల సేవా ఉత్సాహాన్ని దెబ్బతీస్తున్నాయి. గ్రామీణ ఆరోగ్య సమస్యలను కేవలం కొత్త ఆసుపత్రులు నిర్మించడం ద్వారా మాత్రమే పరిష్కరించలేం. వైద్యులు గ్రామాల్లో స్థిరంగా పనిచేయాలంటే సమగ్ర జీవన వాతావరణాన్ని కల్పించాలి. భద్రత కలిగిన నివాస సముదాయాలు, నాణ్యమైన పాఠశాలలు, షాపింగ్ సదుపాయాలు, వినోదం, డిజిటల్ కనెక్టివిటీ, సమర్థవంతమైన రవాణా, మెరుగైన ఆసుపత్రి మౌలిక వసతులు, నిరంతర విద్యుత్ సరఫరా, ఆధునిక నిర్ధారణ పరికరాలు, అవసరమైన మందుల నిల్వలు, శిక్షణ పొందిన పారామెడికల్ సిబ్బంది, నిర్వహణ సేవలు అందుబాటులో ఉండాలి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే వైద్యులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, వృత్తిపరమైన ఎదుగుదలకు అవకాశాలు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన సౌకర్యాలు కల్పించాలి. టెలీమెడిసిన్ సేవలను జిల్లా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో అనుసంధానం చేస్తే గ్రామీణ ప్రజలకు నిపుణుల సలహాలు త్వరగా అందించవచ్చు. గ్రామీణ ఆరోగ్య సేవల స్థిరమైన అభివృద్ధి అనేది కేవలం వైద్య విధానానికి సంబంధించిన అంశం కాదు; అది సమగ్ర గ్రామీణాభివృద్ధి లక్ష్యం. రహదారులు, తాగునీరు, విద్య, డిజిటల్ కనెక్టివిటీ, ఉపాధి, భద్రత, సామాజిక మౌలిక వసతులు, ఆరోగ్య వ్యవస్థ---ఈ అంశాలు పరస్పరం అనుసంధానమై ఉంటాయి. గ్రామాలు నివసించడానికి అనుకూలమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా మారినప్పుడే నాణ్యమైన వైద్య సిబ్బంది అక్కడ స్థిరపడతారు. అప్పుడే గ్రామీణ ప్రజలకు సమానమైన ఆరోగ్య హక్కు నిజమైన అర్థంలో అందుబాటులోకి వస్తుంది. అందువల్ల గ్రామీణ వైద్య మౌలిక వసతుల బలోపేతాన్ని ఒక ఆరోగ్య కార్యక్రమంగా కాకుండా సమగ్ర గ్రామీణాభివృద్ధి ఉద్యమంగా పరిగణించి అమలు చేయాల్సిన అవసరం ఉంది.

# నేడు ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

**-మన జీవితంలో ప్రకృతి ప్రాముఖ్యతను గుర్తుచేసే ముఖ్యమైన రోజు ఈ రోజు**

ప్రతి ఏడాది జూలై 28 వ తేదిన ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారు. మన జీవితంలో ప్రకృతి ప్రాముఖ్యతను, దాన్ని ఎందుకు పరిరక్షించాలో గుర్తుచేసే ముఖ్యమైన రోజు ఈ రోజు. ప్రకృతి పరిరక్షణ గురించి అవగాహన పెంచ డానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి ఈ రోజు మనకు అవకాశాన్ని ఇస్తుంది. సహజ వనరులను పరిరక్షించేందుకు ఉత్తమమైన పద్ధతుల గురించి అవగాహన కల్పిం చడానికి ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా గుర్తిం చబడింది. భూమిపై పరిమిత వనరులు ఉన్నందున సమతుల్యతను కాపాడు కోవడానికి వాటిని సమర్థవంతంగా ఉప యోగించాల్సిన ఆవశ్యకతను తెలియ జేస్తుంది. జనాభా విస్ఫోటనం సహజ వనరులు చాలా వేగంగా క్షీణించటానికి ఓ ప్రధాన కారణం ఉంది. సాంకేతిక పురోగతి, విలాసవంతమైన జీవనశైలి, గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొర క్షీణత, ఇటీవలి కాలంలో అమెజాన్ అడవుల్లో చెలరేగిన మంటలు వంటివి పర్యావరణ సమస్యలను లేవనెత్తుతున్నాయి. భవిష్యత్తులో బాధపడకుండా ఉండాలంటే ప్రకృతి సమతుల్యత కోసం వీటిని పాటించాలి. - ఆహార, నీటి వృథాను అరికట్టడం- రోజువారి కార్యకలాపాల్లో కాలుష్యాన్ని పెంపొందించే వాటిని నిరుత్సాహపరచడం - పనిలో లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్‌లను బంద్ చేయడం - దంతాలను, చేతులను శుభ్రపరుచుకునేప్పుడు నల్లాలను అనవసరంగా తిప్పి ఉంచకుండా ఉండి నీటి వృథాను అరికట్టడం. మన దైనందిన జీవితంలో ఇటువంటి చిన్న చిన్న పనులను ఆచరించడం వల్ల ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడంలో సహాయం పడినవాళ్లమౌతాం. సమీప భవిష్యతుల్లో ఎదురయ్యే ఎటువంటి ప్రకృతి విపత్తుల నుంచైనా మానవాళిని రక్షించుకోవచ్చు. అందుకు కుటుంబ సభ్యుల్లో సైతం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రకృతిని రక్షించడానికి, పరిరక్షించడానికి స్థిరమైన జీవనశైలిని ఆచరించడం.




# బాలికల ఆశ్రమ పాఠశాలలో మగ హెచ్ఎం నియామకం...






**బాధ్యతలపై హెచ్ఎం వ్యాఖ్యలు చర్చనీయాంశం**

**వాంకిడి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పరిపాలనపై పలు ప్రశ్నలు**

**ఉన్నతాధికారుల విచారణ కోరుతున్న తల్లిదండ్రులు, స్థానికులు**

ప్రజా వీక్షణం ,ఆసిఫాబాద్,27 జూలై 2026

వాంకిడి మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)లో ప్రధానోపాధ్యాయుడిగా మగ ఉపాధ్యా యుడు విధులు నిర్వహించడం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పూర్తిగా బాలికలు విద్యనభ్యసిస్తున్న ఈ విద్యాసంస్థలో మహిళా ప్రధానోపా ధ్యాయురాలిని నియమిస్తే విద్యార్థినులకు మరింత సౌకర్యంగా ఉంటుందని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయప డుతున్నారు. అయితే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం నారాయణమూర్తి మీడియాతో చేసినట్లు చెప్పబడుతున్న వ్యాఖ్యలు మరింత చర్చకు దారితీశాయి. పాఠశాల పరిపాలన, విద్యా ప్రమాణా లు, మౌలిక వసతులు, విద్యార్థినుల సంక్షేమం వంటి అంశాలపై మీడియా వివరణ కోరగా, తాను స్వచ్ఛందంగా హెచ్ఎం బాధ్యతలు చేపట్టలేదని, పైస్థాయి అధికారుల ఆదేశాల మేరకే ఈ హోదాలో కొనసాగుతున్నానని ఆయన పేర్కొన్నట్లు సమాచారం.నన్ను బలవంత ంగా ఈ కుర్చీలో కూర్చోబెట్టారు. నాకు ఈ హోదాలో కొనసాగడం ఇష్టం లేదు. నేను తెలుగు ఉపాధ్యాయుడిని. అదే నా అసలు ఉద్యోగం అని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. తనను తిరిగి తెలుగు ఉపాధ్యాయుడిగా నియమించాలని ఉన్నతాధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు ఆయన మీడియాకు చూపించినట్లు సమాచారం. అయితే వాటి ప్రతులను ఇవ్వాలని కోరగా, అవి వ్యక్తిగత పత్రాలు అంటూ ఇవ్వడానికి నిరాకరించినట్లు తెలిసింది. సంభాషణలో భాగంగా పాఠశాల నిర్మాణాల నాణ్యత, ఇతర అభివృద్ధి పనులపై మీడియా ప్రశ్నించగా,అది నాకేం సంబంధించిన విషయం కాదు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ఎలా సంతకం పెడితే నేను కూడా అలాగే సంతకం చేస్తున్నాను అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు పాఠశాల పరిపాలనలో ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రధానోపాధ్యా యుడు విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు, ఆరోగ్యం, భద్రత, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాల అమలు, పాఠశాల నిర్వహణ వంటి అంశాలపై పర్యవేక్షణ బాధ్యత వహిస్తారని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాంటి హోదాలో ఉన్న వ్యక్తి చేసినట్లు చెప్పబడుతున్న వ్యాఖ్యలు సహజంగానే చర్చకు దారితీస్తు న్నాయని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ సందర్భంగా తాను గతంలో ఈనాడు పత్రికలో పాత్రికేయుడిగా పనిచేశానని, తన భార్య ప్రస్తుతం అదే సంస్థలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారని కూడా ఆయన తెలిపినట్లు సమాచారం. పదవీ విరమణ అనంతరం మళ్లీ జర్నలిజం రంగంలోకి రావాలని తనకు ఆసక్తి ఉందని, పాత్రికేయులు ఉన్నది ఉన్నట్లు రాయాలి" అని మీడియాను కోరినట్లు తెలుస్తోంది. హెచ్ఎం కుర్చీలో కూర్చోండి అని మీడియా కోరగా, నా ఇష్టం... నేను తెలుగు టీచర్‌గానే ఉంటాను అని ఆయన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అలాగే పాత్రికేయులు ఎంత రాస్తారో రాయండి. సస్పెండ్ చేసినా, చేయకపోయినా నా వయస్సు ప్రకారం ప్రభుత్వం జీతం ఇస్తుంది అని వ్యాఖ్యానించినట్లు కూడా చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలు అక్కడ ఉన్నవారిలో ఆశ్చర్యం కలిగించాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మొత్తం సంభాషణ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గదిలో జరిగినట్లు సమాచారం. ఆ గదిలో సీసీ కెమెరా అమర్చబడి ఉందని మీడియా గమనించినట్లు పేర్కొంది. జూలై 27,07 2026న జరిగిన ఈ సంభాషణకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదై ఉండే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. అవసరమైతే సంబంధిత ఉన్నతాధికారులు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని వారు కోరుతున్నారు. మరోవైపు, పూర్తిగా బాలికలు మాత్రమే నివసిస్తూ విద్యనభ్య సించే ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినుల భద్రత, మానసిక సౌకర్యం, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మహిళా ప్రధానోపాధ్యా యురాలిని నియమించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కొందరు తల్లిదండ్రులు సూచిస్తున్నారు. అయితే ఈ అంశంపై తుది నిర్ణయం సంబంధిత శాఖ విధానాలపై ఆధారపడి ఉంటుం దని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటు న్నాయి. ఈ వ్యవహారంపై గిరిజన సంక్షేమ శాఖ, విద్యాశాఖ ఉన్నతాధి కారులు స్పందించి, హెచ్ఎం చేసినట్లు చెప్పబడుతున్న వ్యాఖ్యలతో పాటు పాఠశాల పరిపాలన, బాధ్యతల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, విద్యార్థినుల సంక్షేమం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారుల విచారణ అనంతరం మాత్రమే పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉందని విద్యావర్గాలు అభిప్రాయప డుతున్నాయి.

# మంథని బీసీ బాలికల ఎస్ఎంహెచ్ హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి

**-ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్**

మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , జూలై 27:

మంథని బీసీ బాలికల స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ (ఎస్ఎంహెచ్) వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ డిమాండ్ చేశారు.సోమవారం ఎస్ఎఫ్ఐ మంథని మండల కమిటి ఆధ్వర్యంలో పట్టణంలోని వాగుగడ్డలో గల హాస్టల్ ను నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు హాస్టల్ లోని సమస్యలు తెలుసుకుందామని వెళితే హాస్టల్ కి తాళం వేసి మూసి ఉన్నదని మంథనిలో వరుసగా వివిధ హాస్టల్లు మూతపడడానికి కారణం హాస్టల్ వార్డెన్ లు అని జిల్లా అధికారుల నిర్లక్ష్యం కూడా స్పష్టంగా కనబడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం నుండి వేతనాలు తీసుకుంటూ విధులు సక్రమంగా నిర్వహించకుండా హాస్టల్ లు మూతపడడానికి అధికారులు కారణమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే మంథని లో విద్యావ్యవస్థ కుంటుపడుతుందని అన్నారు. మంథనిలో కాలేజీలు పాఠశాలలు నడుస్తున్న క్రమంలో హాస్టల్ లు మూతపడి ఉండడం ఏంటని మండిపడ్డారు. అడ్మిషన్లు అవుతున్న క్రమంలో హాస్టల్ లు తలుపులు వేసి తాళాలు ఉంటే మరి అడ్మిషన్లు ఏ విధంగా జరుగుతాయని అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా మంథని లోని ఎస్సీ బాలికల హాస్టల్ కూడా అదే పరిస్థితిలో తలుపులకు తాళాలు వేసి కొనసాగుతుంది అన్నారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నియోజకవర్గ కేంద్రంలోనే హాస్టల్ కాలేజీల పరిస్థితి ఇలా కొనసాగడం విచారకరమని అన్నారు. మంత్రి వెంటనే స్పందించి మంథని నియోజకవర్గం లో ఉన్న హాస్టల్ లు సాంఘిక సంక్షేమ హాస్టల్ గురుకుల పాఠశాలలు ప్రభుత్వ కాలేజీలు ప్రభుత్వ పాఠశాలలో సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యలుపరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్ కుమార్,అఖిల్,మహేందర్, కిరణ్,చరణ్ పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక
SPORTS/ BUSINESS
28 మంగళవారం, జులై 2026
www.prajaveekshanam.in

# సరికొత్త ఓపెనర్స్‌తో బరిలోకి టీమిండియా..?

భారత క్రికెట్ వర్గాల్లో పదిహేనేళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరు ఇప్పుడు మారుమోగుతోంది. జింబాబ్వే టూర్‌లో అదరగొట్టిన ఈ టీనేజ్ సెన్సేషన్‌ను 2027 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దించాలని మాజీ దిగ్గజం ఫరూఖ్ ఇంజనీర్ సంచలన సూచన చేశారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెంటనే ఈ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేయడం ఆసక్తికరంగా మారింది.వన్డే ప్రపంచకప్ 2027 టార్గెట్‌గా టీమిండియా సన్నాహాలు మొదలుపెట్టాల్సిన సమయం వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఫరూఖ్ ఇంజనీర్ చేసిన వ్యాఖ్యలు జాతీయ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం భారత వన్డే జట్టులో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా ఇన్నింగ్స్ ఆరంభిస్తున్నారు. అయితే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ వ్యూహాన్ని మార్చాలని ఆయన సూచించారు. గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మాట వాస్తవమే అయినా.. అతడిని నాలుగో స్థానంలో ఆడిస్తే జట్టుకు మరింత మేలు జరుగుతుందన్నది ఫరూఖ్ అభిప్రాయం. గిల్ గాల్లోకి లేపి భారీ షాట్లు ఆడే రకం కాదు.. అతడో పక్కా క్లాస్ ప్లేయర్ కాబట్టి అతనికి మిడిలార్డర్ బాధ్యతలు అప్పగించాలన్నారు.అదే జరిగితే కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంటుంది. మైదానంలో ఈ లెఫ్ట్-రైట్ కాంబినేషన్ అద్భుతంగా వర్కవుట్ అవుతుందని ఆయన విశ్లేషించారు. వైభవ్ లాంటి దూకుడున్న ఆటగాడు పవర్‌ప్లేలో ఫీల్డింగ్ గ్యాప్స్ సునాయాసంగా కనుక్కుని బౌండరీలు బాదగలడు. అతడు ఆరంభంలోనే వేగంగా పరుగులు రాబడితే.. మిగతా బ్యాటర్లు కుదురుకుని భారీ లక్ష్యాలను నిర్దేశించడానికి పుష్కలంగా సమయం దొరుకుతుంది.ఫరూఖ్ సూచించిన కొత్త బ్యాటింగ్ లైనప్ ప్రకారం.. రోహిత్, సూర్యవంశీ ఓపెనింగ్ చేస్తే.. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ తనకిష్టమైన మూడో స్థానంలోనే వస్తాడు. ఆ తర్వాత నాలుగో నంబర్‌లో శుభ్‌మన్ గిల్ వస్తే టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ అత్యంత పటిష్ఠంగా మారుతుంది. పటిష్ఠమైన బేస్ ఏర్పడ్డాక మిడిలార్డర్‌లో గిల్ లాంటి సాంకేతిక నైపుణ్యం ఉన్న బ్యాటర్ ఉంటే జట్టుకు తిరుగుండదని ఫరూఖ్ అంచనా వేస్తున్నారు.ఇటీవలే జింబాబ్వేతో ముగిసిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో వైభవ్ ఏ స్థాయిలో చెలరేగాడో అందరం చూశాం. రెండు అద్భుతమైన హాఫ్ సెంచరీలు సాధించి మొత్తం 151 పరుగులు ఖాతాలో వేసుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు సైతం సొంతం చేసుకుని సెలెక్టర్ల దృష్టిని బలంగా ఆకర్షించాడు. ఇలాంటి అద్భుతమైన ఫామ్‌లో ఉన్న కుర్రాడిని వెంటనే వన్డే జట్టులోకి తీసుకోవడానికి ఇదే సరైన తరుణమని మాజీ వికెట్ కీపర్ గట్టిగా చెబుతున్నారు. అతడి వయసు కేవలం 15 ఏళ్లే అయినా.. జాతీయ జట్టు తరఫున మ్యాచ్‌లు గెలిపించేంత ఆత్మవిశ్వాసం ఆ కుర్రాడిలో పుష్కలంగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. వన్డేలు, టీ20ల మధ్య పెద్దగా తేడా చూడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ.. అతడిని క్రికెట్ దిగ్గజం వివ్ రిచర్డ్స్‌తో పోల్చారు. రిచర్డ్స్ ఏ ఫార్మాట్లో ఆడినా బౌలర్లపై విరుచుకుపడేవాడు.. అచ్చం అలాగే వైభవ్ కూడా ఒక జీనియస్ అని కొనియాడారు. షార్ట్ పిచ్ బంతులు పడితే వాటిని కచ్చితంగా సిక్సర్లుగా మలిచే సత్తా ఈ కుర్రాడి సొంతం. అయితే అతడికి అతిగా కోచింగ్ ఇచ్చి సహజ సిద్ధమైన శైలిని నాశనం చేయొద్దని బీసీసీఐకి సూచించారు. పుస్తకాల్లో ఉన్నట్లు కాకుండా తనదైన శైలిలో ఆడే ఈ కుర్రాడికి పదే పదే సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ తనను తాను మెరుగుపరుచుకునే లక్షణం అతడిలో ఉందని ప్రశంసించారు.

## వెయిట్ లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్?కు రజతం

కామన్వెల్త్ గేమ్స్?లో భారత్? ఖాతాలో ఐదో పతకం చేసింది. వెయిట్?లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్? సిల్వర్ మెడల్ సాధించింది. సోమవారం జరిగిన మహిళల 53 కేజీల విభాగం వెయిట్?లిఫ్టింగ్?లో రెండో స్థానంలో నిలిచిన జ్ఞానేశ్వరికి రజతం దక్కింది. ఈ పోటీలో తొలి స్థానంలో నిలిచిన ఒనోమి ఒమోలోల (నైజీరియా) గోల్డ్ ముద్దాడగా, రెబెక (కెనడా)కు కాంస్యం దక్కింది. ఈ పోటీలో జ్ఞానేశ్వరీ అద్భుత పోరాట పటిమ కనబర్చింది. అయితే కేవలం 7 పాయింట్ల తేడాతో ఆమె స్వర్ణం మిస్ అయ్యింది. స్నాచ్?లో తొలి రెండు ప్రయత్నాల్లో 82, 85 కేజీల బరువు ఎత్తిని యాదవ్ మూడో ప్రయత్నంలో సక్సెస్?ఫుల్?గా 88 కేజీలు ఎత్తింది. ఇక క్లీన్ అండ్ జెర్క్?లో తొలి రెండుసార్లు 103, 105 కేజీలు ఎత్తగా, చివరి ప్రయత్నంలో 111 కేజీలు బరువుతో సత్తా చాటింది. దీంతో మొత్తం 199 కేజీలతో జ్ఞానేశ్వరి రెండో స్థానంలో నిలిచింది. ఇదే పోటీలో నైజీరియా వెయిట్ లిఫ్టర్ ఒనమి ఒనోమోల స్నాచ్?లో ఏకంగా 93 కేజీలు ఎత్తింది. ఇక ఇక క్లీన్ అండ్ జెర్క్?లోనూ సత్తా చాటుతూ 113 కేజీలు ఎత్తింది. మొత్తం స్కోర్ 206 కేజీలు నమోదు చేసిన ఒనోమోల గోల్డ్ మెడల్ పట్టేసింది.

## ఆకట్టుకోలేకపోయిన బాబర్ ఆజం

వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు ఆట ముగిసేసరికి పాకిస్థాన్ 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన బాబర్ ఆజం 23 పరుగులకు ఔటవ్వగా.. షాన్ మసూద్ 88 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దాదాపు మూడేళ్ల విరామం అనంతరం టెస్ట్ క్రికెట్లో పాక్ కెప్టెన్‌గా తిరిగొచ్చిన బాబర్ ఆజం.. బ్యాటింగ్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టు రెండో రోజు ఆటలో బాబర్ ఆజం కేవలం 23 పరుగులకే ఔటయ్యాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్థాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసి.. ఆతిథ్య జట్టు కంటే ఇంకా 112 పరుగుల వెనుకబడి ఉంది.జులై 2023 తర్వాత తొలిసారిగా టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన బాబర్ ఆజం క్రీజులో మంచి ఫామ్ లో కనిపించాడు. బాబర్ ఆజం తన 38 బంతుల ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు కొట్టాడు. కానీ వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. బాబర్ ఆజం తన చివరి టెస్ట్ సెంచరీని దాదాపు నాలుగేళ్ల క్రితం కరాచీలో న్యూజిలాండ్‌పై సాధించాడు. బాబర్ ఆజం ఇప్పటివరకు 63 టెస్ట్ మ్యాచ్‌లలో 42.49 సగటుతో 4504 పరుగులు సాధించాడు, ఇందులో తొమ్మిది సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కెమర్ రోచ్ బౌలింగ్‌లో ఓపెనర్ అజాన్ ఒవైస్ డకౌట్ అవ్వడంతో పాకిస్థాన్‌కు పేలవమైన ఆరంభం లభించింది. ఆ తర్వాత మాజీ కెప్టెన్ షాన్ మసూద్, ఇమామ్-ఉల్-హక్(63) రెండో వికెట్‌కు అద్భుతమైన 155 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షాన్ మసూద్ 137 బంతుల్లో 11 ఫోర్లతో 88 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా.. అప్పుడే క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ సల్మాన్ అఘా ఇంకా తన ఖాతా తెరవలేదు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 311 పరుగుల వద్ద ముగిసింది. వికెట్ కీపర్ షాయ్ హోప్ (92 పరుగులు), కావెమ్ హాడ్జ్ (84 పరుగులు) జట్టును బలమైన స్కోరుకు చేర్చారు. పాకిస్థాన్ తరఫున ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ అలీ అద్భుతంగా బౌలింగ్ చేసి 50 పరుగులకు 4 వికెట్లు తీయగా.. మహమ్మద్ అబ్బాస్ 63 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు.

## వైభవ్ సూర్యవంశీపై వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు

జింబాబ్వేతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 49 బంతుల్లో 81 పరుగులు చేసి జట్టు ఘనవిజయంలో కీలక పాత్ర పోషించాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను భారత్ గెలుచుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను కూడా కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం భారత తాత్కాలిక ప్రధాన కోచ్ వివిఎస్ లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం 15 సంవత్సరాల వయస్సులోనే వైభవ్ చూపుతున్న ఆత్మవిశ్వాసం, పరిణతి అద్భుతమని కొనియాడిన లక్ష్మణ్, భవిష్యత్తులో అతను మరింత ఎదగడానికి ఓ కీలకమైన సలహా ఇచ్చారు. వైభవ్ సూర్యవంశీలోని ప్రతిభను బీసీసీఐ రెండున్నర సంవత్సరాల క్రితమే గుర్తించిందని లక్ష్మణ్ వెల్లడించారు. 2024 అండర్-19 ప్రపంచ కప్‌కు ముందు విజయవాడలో జరిగిన క్వాడ్రాంగ్యులర్ సిరీస్‌లో ఇండియా-బి తరఫున వైభవ్ అత్యధిక పరుగులు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచే అతనికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్యాంపుల్లో శిక్షణ ఇస్తూ, అండర్-19 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచేలా తీర్చిదిద్దామని తెలిపారు. వైభవ్ ఒక ఆటగాడిగానే కాకుండా వ్యక్తిగతంగా ఎలాంటి ఆలోచనా ధోరణి కలిగి ఉంటాడో మేనేజ్‌మెంట్‌కు పూర్తిగా తెలుసని లక్ష్మణ్ చెప్పారు. గత ఆరు నెలల కాలంలో వైభవ్ వ్యక్తిగతంగా ఎదిగిన తీరు, ఆటపై అతనికి ఉన్న అవగాహన, మెచ్యూరిటీ లెవల్స్ ఆకాశాన్ని తాకాయని లక్ష్మణ్ ప్రశంసించారు. అందుకే అంతర్జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద బౌలర్లను ఎదుర్కొంటూ ఒత్తిడి సమయాల్లోనూ రాణించగలుగుతున్నాడని చెప్పారు. అయితే వైభవ్ ఇంకా చాలా మెరుగుపడాల్సిన ఏకైక ప్రధాన అంశం అతని ఓవరాల్ ఫిట్‌నెస్ అని లక్ష్మణ్ స్పష్టం చేశారు. అతను ఇంకా 15 ఏళ్ల చిన్న కుర్రాడేనని, రాబోయే రోజుల్లో తన ఫిట్‌నెస్ స్థాయిలను పెంచుకుంటే క్రికెట్ ప్రపంచంలో తిరుగులేని ప్లేయర్‌గా మారతాడని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు.ఆటలోని ప్రతి విభాగంలోనూ తానను తాను మెరుగుపరుచుకోవాలనే తపన వైభవ్‌లో స్పష్టంగా కనిపిస్తుందని కోచ్ లక్ష్మణ్ కొనియాడారు. మూడో టీ20 మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దెబ్బ తగిలి గాయపడినప్పటికీ, మైదానాన్ని వదిలి వెళ్లకుండా జట్టు కోసం ఫీల్డింగ్ కొనసాగించాలని వైభవ్ భావించాడని తెలిపారు. కానీ జట్టు ఫిజియో వచ్చి బలవంతంగా అతనిని బయటకు తీసుకువెళ్లారని చెప్పారు. చిన్న వయసులోనే జట్టు విజయం కోసం అతను చూపించిన ఈ అంకితభావం, పట్టుదల నిజంగా అభినందనీయమని లక్ష్మణ్ ప్రశంసించారు.



## రాజా ముత్తుపాండికి రజతం

కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత వెయిట్‌లిఫ్టర్లు తమ సత్తా చాటుతున్నారు. ఆదివారం జరిగిన పురుషుల 65 కేజీల విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి రజత పతకం సాధించాడు. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ విభాగాల్లో కలిపి 286 కేజీలు ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. దీంతో గ్లాస్గోలో భారత్‌కు ఆ రోజే వెయిట్‌లిఫ్టింగ్‌లో మూడో పతకం లభించింది. తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల రాజా ముత్తుపాండి స్నాచ్‌లో 126 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 160 కేజీలు విజయవంతంగా ఎత్తాడు. రెండు విభాగాల్లో కలిపి 286 కేజీల మొత్తం బరువుతో రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. విభాగంలో మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిడిన్ మహ్మద్ మొత్తం 299 కేజీలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణాన్ని గెలుచుకున్న ఘనత కూడా అతని ఖాతాలో చేరింది. రాజా ముత్తుపాండి విజయానికి వెనక సుదీర్ఘ పోరాటం ఉంది. 2019లో మోచేతి లిగమెంట్‌కు తీవ్రమైన గాయం కావడంతో అతని కెరీర్ సంక్షోభంలో పడింది. అనంతరం కరోనా మహమ్మారి కారణంగా పునరావాస ప్రక్రియ కూడా దెబ్బతింది. అంతేకాకుండా కొత్త బరువు విభాగాలకు మార్పు, భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ జెరెమీ లాల్?రిన్నుంగా ఎదుగుదలతో 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు ఎంపిక కాలేకపోయాడు. అయితే 65 కేజీల విభాగం ప్రవేశపెట్టిన తర్వాత మళ్లీ జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. 2025 ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగా 299 కేజీలు ఎత్తి తొమ్మిదో స్థానంలో నిలవడం అతనికి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇప్పుడు అదే జోరును కొనసాగిస్తూ కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ విజయాన్ని తల్లిదండ్రులు, కోచ్ విజయ్ శర్మకు అంకితం చేస్తానని రాజా ముత్తుపాండి తెలిపాడు. అయితే స్వర్ణ పతకాన్ని అందుకోలేకపోవడం తనకు నిరాశ కలిగించిందని తెలిపాడు. కోచ్? తనపై పూర్తి విశ్వాసం ఉంచారని, కానీ ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వలేకపోయానని అన్నాడు. అయితే ఈ పోటీ నుంచి నేర్చుకున్న పాఠాలతో మరింత కష్టపడి శిక్షణ తీసుకుని భవిష్యత్తులో స్వర్ణం సాధించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశాడు. ఆదివారం భారత పతకాల ఖాతాలో చేరిన మూడు పతకాలు కూడా వెయిట్‌లిఫ్టింగ్ నుంచే రావడం విశేషం. అంతకుముందు మహిళల 48 కేజీల విభాగంలో ఒలింపిక్ రజత పతక విజేత మీరాబాయి చాను వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అలాగే పురుషుల 60 కేజీల విభాగంలో చనాంబం రిషికాంతా సింగ్ రజత పతకం సాధించి భారత్‌కు మరో విజయాన్ని అందించాడు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ మరోసారి భారత పతకాల వేటలో కీలక పాత్ర పోషించింది.మరోవైపు బాక్సింగ్‌లో భారత్‌కు తొలి నిరాశ ఎదురైంది. పురుషుల విభాగంలో పోటీపడిన ఆదిత్య ప్రతాప్ యాదవ్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ఉగాండాకు చెందిన నుహు బట్టే చేతిలో 3-2 తేడాతో ఓడిపోయాడు. దీంతో గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సింగ్ జట్టుకు తొలి ఓటమి నమోదైంది.



ప్రజావీక్షణం దినపత్రిక

# పొలిమేర-3 లో అర్జున్



టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది. ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# ఆదర్శ కుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.




# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.

# అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్

## జైన్ కులం, మతంపై విమర్శలు. .పట్టించుకోని యువనటుడు

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.నేను నటుడిని. నా జీవితంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు తప్పవు. అందుకు సిద్ధంగా ఉండాలని నేను ముందుగానే చెప్పాను. ఆమె కూడా చాలా పరిణతితో అర్థం చేసుకుంది. వయసు, మతం గురించి వచ్చిన కామెంట్లను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంది. అదే నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు.తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సమయంలో జైనబ్ తనకు అండగా నిలిచిందని అఖిల్ భావోద్వేగంగా చెప్పారు. ప్రేమలో కులం, మతం, వయసు కంటే పరస్పర అవగాహన, నమ్మకం ముఖ్యమని అఖిల్ అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలని యువతకు సూచించారు.






Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com